నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 25 అక్టోబర్ 2024 | SIDDIPET

# డీడీఎస్‌పై తప్పుడు ఆరోపణలు తగవు

- బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలి
- డీడీఎస్ మహిళా ప్రతినిధులు

సంగారెడ్డి జిల్లా పస్తాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు

జహీరాబాద్, అక్టోబర్ 24: పాత పంటల పరిరక్షణతోపాటు మహిళా సంఘాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్)పై కొందరూ బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలని డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు హితవు పలికారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లోని డీడీఎస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో సంస్థలో పనిచేసి బయటకు వెళ్లిన కొందరు మరికొన్ని సంస్థలతో కలిసి డీడీఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థల నుంచి డీడీఎస్‌కు విరాళాలు రాకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. డీడీఎస్‌తో సంబంధం లేని కొందరు వ్యక్తులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీడీఎస్ సెక్రటరీగా పనిచేసిన పీవీ సతీశ్ 2023 వరకు సంస్థలో ఉన్నారన్నారు. ఆయన మరణానంతరం తప్పుడు ఆరోపణలతో డీడీఎస్‌ను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. 30 ఏండ్లుగా డీడీఎస్ నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, లావాదేవీల గురించి ఈ సందర్భంగా వివరించారు. సమావేశంలో డీడీఎస్ మహిళ సంఘాల సభ్యులు అనుసూయమ్మ, నాగమ్మ, లక్ష్మమ్మ, సూర్యకళ, స్వరూపమ్మ, మొగులమ్మ, చంద్రమ్మ, సురేమ్మ, నర్సమ్మ, డీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్ట్

గంజాయి కేసు వివరాలు తెలుపుతున్న పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ స్వామిగౌడ్

పటాన్‌చెరు, అక్టోబర్ 24 : అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను బీడీఎల్ భానూర్ పోలీసులు పట్టుకుని 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయంలో మీడియాకు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, బీడీఎల్ భానూర్ ఎస్‌హెచ్‌వో స్వామిగౌడ్ వివరాలు వెల్లడించారు. బుధవారం బీడీఎల్ ఎస్‌హెచ్‌వో సిబ్బందితో కలసి నిర్వహిస్తున్న తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన కారును పరిశీలించారు. ఈ తనిఖీలో 25 ప్యాకెట్ల గంజాయి లభించింది. వాహనం నడుపుతున్న మల్లేశ్ జాదవ్(26)ను విచారించారు. బీదర్ జిల్లాకు చెందిన మల్లేశ్ జాదవ్ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తాడు. కొనేండ్లుగా అతడు గంజాయి నేరగాళ్లతో సావాసం చేసి తానే గంజాయి అమ్మే స్మగ్లర్‌గా మారాడు. గంజాయిని ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నాడు. అతడి నుంచి రూ.12లక్షల విలువైన 50 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, బైక్, రెండు మొబైల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. అతడితోపాటు గంజాయి స్మగ్లింగ్‌లో పాల్గొంటున్న దాదాపాటిల్, ప్రవీణ్, బీదన్ పరారీలో ఉన్నారని, మల్లేశ్ జాదవ్‌ను అరెస్టు చేసి సంగారెడ్డి కోర్టుకు తరలిస్తున్నామని చెప్పారు. నిందితుడిని పట్టుకున్న బీడీఎల్ ఎస్‌హెచ్‌వో స్వామిగౌడ్‌ను, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ, పక్కన మంత్రి కొండా సురేఖ, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ
- ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తాం
- సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో నూతన పీహెచ్‌సీ భవనం ప్రారంభం

హత్నూర, అక్టోబర్ 24: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్‌లో రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని గురువారం మంత్రి కొండా సురేఖ, టీజీఐసీసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ..నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై తరుచూ రోడ్డుప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో అత్యవసర వైద్యసేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 30 పడకల దవాఖానగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, పర్యావరణం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. దౌల్తాబాద్ ప్రభు త్వ దవాఖాన భవనం శిథిలావస్థకు చేరడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.1.56 కోట్ల నిధులు మంజూరు చేసి భవనం నిర్మాణ పనులు పూర్తి చేయగా, ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. దౌల్తాబాద్ దవాఖాన భవ నం ప్రారంభోత్సవంపై ఎందుకు సమాచారం ఇవ్వలేదంటూ జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవిపై ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, ఆర్డీవో నాగరాజు, తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎం పీపీ నర్సింహులు, మాజీ సర్పంచ్ వెంకటేశం పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులతో మంత్రులు దామోదర, కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రోహిత్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు

# మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

## వచ్చే ఏడాది మెదక్‌లో 220 పడకల దవాఖాన, నర్సింగ్, పారామెడికల్ కళాశాలలు ప్రారంభిస్తాం

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- వైద్య వృత్తికి న్యాయం చేయాలి : మంత్రి కొండా సురేఖ
- మెదక్‌లో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం
- బీఆర్‌ఎస్ హయాంలో మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేసిన కేసీఆర్

మెదక్‌లో మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ తదితరులు

మెదక్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ పనిచేస్తున్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. గురువారం మెదక్‌లోని పిల్లికోటాల్ ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ... త్వరలో రాష్ట్రంలో మరో ఐదు క్యాన్సర్ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం డయాబెటీస్, క్యాన్సర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులతో ఎక్కువ మంది బాధపడుతున్నారని, వీటిపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్యాన్సర్ కోసం ప్రతి జిల్లాలో మొబైల్ స్క్రీనింగ్ కేంద్రం ఏర్పాటుతో పాటు రాష్ట్రంలో ఐదు క్యాన్సర్ సెక్టార్లను ఏర్పాటు చేసి ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానను హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 74 ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో, ప్రతి మండల స్థాయిలో వైద్యం సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రణాళిక ప్రభుత్వం చేస్తున్నట్లు తెలిపారు. మెదక్‌లో 220 పడకల దవాఖాన భవన నిర్మాణం, నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల, అన్ని రకాల మౌలిక వసతులను వచ్చే విద్యా సంవత్సరం వరకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు విజయవంతంగా కోర్సు పూర్తిచేసి వృత్తికి న్యాయం చేయాలన్నారు. మెదక్ మెడికల్ కళాశాలకు అవసరమైన నర్సింగ్, పారామెడికల్ కళాశాల మంజూరు చేయాలని మంత్రి దామోదర్‌ను ఆమె కోరారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. పేదలకు వైద్యం అందుబాటులోకి రావాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 387 నూతన మెడికల్ కళాశాలలను మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ.. మెదక్ ప్రజల చిరకాల కోరిక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. స్వతహాగా తాను వైద్యుడిని అని, మెదక్ జిల్లా ప్రజల కష్టనష్టాలు తెలిసినవాడిగా మీ కష్టాల్లో పాలుపంచుకుంటానని తెలిపారు. గతేడాది బీఆర్‌ఎస్ హయాంలో మెదక్‌కు మెడికల్ కళాశాలను అప్పటి సీఎం కేసీఆర్ మంజూరు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్ , డీఎంఈ డాక్టర్ వాణి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజకీయాలకతీతంగా అభివృద్ధి

**ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి**

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ..మెదక్ వెనకబడిన ప్రాంతానికి మెడికల్ కాలేజీ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, కేసీఆర్ మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో మొదటి విడతలో మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు కాలేదని, రెండో విడతలో మెడికల్ కళాశాలను కేసీఆర్ మంజూరు చేశారని తెలిపారు. వైద్య కళాశాల ఏర్పాటుతో హైదరాబాద్ లాంటి నగరాలకు వైద్యం కోసం వెళ్లకుండా వైద్యం అందుబాటులో వస్తుందని తెలిపారు. ఎంబీబీఎస్ కోర్సులో పూర్తిస్థాయిలో సీట్లు నిండడం, అందులో ఎక్కువ మంది విద్యార్థినిలు ఉండడంతో ఈ ప్రాంత ప్రజలకు ఓపికతో వైద్యం అందించే డాక్టర్లు తయారవుతారని సంతోషం వ్యక్తం చేశారు. రాజకీయాలు అతీతంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని, నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలని, పూర్తిస్థాయి భవన నిర్మాణం చేపట్టాలని మంత్రులను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

# కేసీఆర్ కృషితోనే మెదక్ మెడికల్ కళాశాల

- 100 నుంచి 50 సీట్లకు తగ్గించి అన్యాయం చేసిన రేవంత్ సర్కార్
- మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ):మెతుకు సీమ మెదక్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే, మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆమె'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ..జిల్లాల పునర్విభజనలో భాగంగా మెదక్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి అన్ని హంగులు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తుచేశారు. మొదటి విడతలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మెడికల్ కళాశాలలను మంజూరు చేయగా, రెండో విడతలో మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పలుమార్లు అసెంబ్లీ సమావేశాల్లో కూడా మెదక్ వెనుకబడి జిల్లా అని, మెదక్ కేంద్రంగా ఏర్పడిన తర్వాత అన్ని హంగులు కల్పిస్తున్నామని, మెడికల్ కళాశాల మంజూరు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు చదువుకునే అవకాశం దక్కుతుందని ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ మెదక్‌కు మెడికల్ కళాశాల కోసం రూ.180 కోట్లు మంజూరు చేస్తూ 100 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించారన్నారు. దీని కోసం మెదక్ శివారులోని మాతాశిశు సంరక్షణ కేంద్రం ప్రాంతంలో 14 ఎకరాలు స్థల సేకరణ చేయగా, అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశామన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెదక్ మెడికల్ కళాశాలకు 100సీట్లలో 50 సీట్లు కేటాయించారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో మెడికల్ కళాశాలకు 50 సీట్లను తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ ప్రాంత ప్రజలతోపాటు విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపించారు.

# ధాన్యం పక్కాగా సేకరించాలి

**అధికారుల సమీక్షలో మంత్రి దామోదర**

మెదక్‌లో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మెదక్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): వానకాలం ధాన్యాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా రైతుల నుంచి పక్కాగా సేకరించాలని అధికార యంత్రాంగాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గురువారం మెదక్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించి రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేకరణ లక్ష్యం మేరకు పూర్తిచేయాలననారు. రుణమాఫీ కాని రైతుల వివరాలతో సమగ్ర నివేదిక తయారు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందును మంత్రి ఆదేశించారు. మార్కెటిం గ్ శాఖ ద్వారా పత్తి కొనుగోలు చేయాలన్నారు. కొత్త ఆరోగ్య ఉప కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వినూత్న ఆలోచనలకు సిద్దిపేట వేదిక

**మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు**

సిద్దిపేటలో తడి,పొడి చెత్త సేకరణను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్లు

సిద్దిపేట, అక్టోబర్ 24: సిద్దిపేటలో గురువారం రాష్ట్రంలోని 11మున్సిపాలిటీలకు సంబంధించిన కమిషనర్లు, అధికారులు పర్యటించారు. ముందుగా పట్టణంలో తడి, పొడి చెత్త వేరుచేయు విధానాన్ని పరిశీలించారు. చెత్తను తరలించే బుస్సాపూర్ రిసోర్స్ పార్క్‌ను సందర్శించి చెత్త ద్వారా తయారు చేసే బయో సీఎన్‌జీ గ్యాస్ ప్లాంట్, బయో మైనింగ్, ఎఫ్‌ఎస్‌టీపీలను పరిశీలించారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేట ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఇర్కోడ్ వద్ద రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన స్లాటర్ హౌజ్‌ను, డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్‌ను, సిద్దిపేటలోని స్వచ్ఛబడిని సందర్శించారు. మున్సిపల్ కమిషనర్లు, అధికారులకు సిద్దిపేటలో జరిగిన అభివృద్ధిని ప్రొజెక్టర్ ద్వారా మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల వివరించారు. రాష్ట్రంలోని మిగతా మున్సిపాలిటీలకు సిద్దిపేట ఆదర్శంగా నిలిచేందుకు హరీశ్‌రావు కృషి, పట్టుదల ఎంతో ఉందన్నారు. సిద్దిపేట ప్రజలు ఎంతో గర్వంగా చెప్పుకునేలా అభివృద్ధి చేసిన నాయకుడు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో ప్రారంభించిన స్టీల్ బ్యాంక్ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. మున్సిపల్ కమిషనర్లు మాట్లాడుతూ..ప్రతి మున్సిపల్ కమిషనర్‌కు సిద్దిపేటలో విధులు నిర్వహించాలనే కోరిక ఉంటుందని, అంతగా అభివృద్ధి చెందిందన్నారు. సిద్దిపేట స్వచ్ఛబడి ఒక నిఘంటువు అని, ఎన్నో వినూత్న ఆలోచనలకు వేదికగా నిలిచిందన్నారు. పట్టణంలో చెత్తను మూడు రకాలుగా వేరు చేసి మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చడం గొప్ప విషయమన్నారు. అనంతరం కోమటిచెరువు, రూబీ నెక్లెస్ రోడ్‌ను వారు సందర్శించారు. వారివెంట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# 'అరుణాచలం'కు ప్రత్యేక బస్సు సర్వీసులు

హుస్నాబాద్, అక్టోబర్ 24: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. భక్తుల సంఖ్యను బట్టి ఎన్ని బస్సులు అవసరమైతే అన్ని నడుపుతామని చెప్పారు. ఈ యాత్ర నవంబర్ 13న ప్రారంభమై 16వ తేదీతో ముగుస్తుందన్నారు. భక్తులు అరుణాచలం గిరిప్రదక్షిణ పూర్తి చేయించి, తిరిగి ఇంటికి చేర్చడం జరుగుతుందన్నారు. పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,800 చార్జీ ఉంటుందని, ఆసక్తిగల భక్తులు హుస్నాబాద్ బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్‌లో అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. వివరాలకోసం 9154298673, 7075146238 నంబర్లను సంప్రదించాలన్నారు.

# అర్బన్ పార్కు మీదుగా ట్రిపుల్ ఆర్

- అందాలను కోల్పోనున్న సంగాపూర్‌లోని అర్బన్ పార్కు
- ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి 30 ఎకరాలకు పైగా కోల్పోయే అవకాశం
- బీఆర్‌ఎస్ హయాంలో రూ.10 కోట్లతో పార్కు అభివృద్ధి
- నిరాశ చెందుతున్న ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు
- పర్యాటకాభివృద్ధికి విఘాతం

సిద్దిపేట జిల్లా గజ్వేల్ అర్బన్ పార్కు

గజ్వేల్, అక్టోబర్ 24: ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్ శివారులో బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన అర్బన్ పార్కు త్వరలో అందాలను కోల్పోనున్నది. కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు మీదుగా ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి అలైన్‌మెంట్ ఖరారైనట్లు తెలిసింది. ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మెదక్ జిల్లాల పరిధిలోని 180ఎకరాల అటవీ భూముల మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ట్రిపుల్‌ఆర్ కోసం మొత్తంగా 4750 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందులో 180 ఎకరాలు అటవీ శాఖకు చెందిన భూములు ఉన్నాయి. గజ్వేల్ ప్రాంతంలో 70 ఎకరాల అటవీ విస్తీర్ణంలో నుంచి ట్రిపుల్‌ఆర్ నిర్మాణం కోసం అధికారులు భూసేకరణ చేపట్టనున్నారు. ఇందులో భాగంగానే గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని సంగాపూర్ వద్ద రూ.10కోట్లతో అద్భుతంగా నిర్మించిన అర్బన్‌పార్కు మీదుగా రోడ్డు వెళ్లనుండడంతో పార్కు తన అందాలను కోల్పోనున్నది. ఈ నిర్ణయంపై ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు నిరాశ చెందుతున్నారు. ఇది పర్యాటకాభివృద్ధికి విఘాతం కల్గిస్తుందని పేర్కొంటున్నారు.

### కోట్ల రూపాయలతో ఏర్పాటు...

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని సంగాపూర్ సమీపంలో రూ.10కోట్లకు పైగా వ్యయంతో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా వినూత్న తరహాలో అర్బన్ పార్కును బీఆర్‌ఎస్ సర్కారు నిర్మించింది. ఈ పార్కులో రాశి వనం, నక్షత్ర, స్మృతివనాలు, యోగ, ధ్యాన మందిరాలు, ఆట స్థలాలు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులు, సైక్లింగ్ ట్రాక్, వాకింగ్‌ట్రాక్, కాటేజీలు, గజబోలు, వాచ్‌టవర్లు ఏర్పాటు చేసి కొత్త హంగులతో తీర్చిదిద్దారు. ఇదే అటవీ ప్రాంతంలోని మల్కబావిని సైతం కొత్తందాలతో తీర్చిదిద్దారు. సెలవు రోజుల్లో చాలామంది చిన్నారులతో కలసి అర్బన్ పార్కుకు వచ్చి వచ్చి సేదతీరుతున్నారు. ఇప్పుడిప్పుడే పార్కుకు ఆదరణ పెరుగుతుండగా ట్రిపుల్‌ఆర్ నిర్మాణంతో అర్బన్ పార్కు అందాలను కోల్పోనున్నది. 100మీటర్ల వెడల్పుతో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం చేపడుతుండగా, అర్బన్ పార్కు మధ్యలో నుంచే రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు చేయడంతో సుమారుగా 30ఎకరాల వరకు పార్కులో భూసేకరణ చేపట్టనున్నారు. మరో 40ఎకరాల అటవీ భూమిని సంగాపూర్, వర్గల్ మండలం మైలారం పరిధిలోని సేకరించనున్నారు. అర్బన్ పార్కు ప్రాంతంలో ట్రిపుల్‌ఆర్ నిర్మాణం జరగనుండడంతో ప్రత్యామ్నాయంగా పార్కుకు వచ్చే సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఉత్తరభాగంలోని 180 ఎకరాల అటవీ భూముల్లో నుంచి ట్రిపుల్‌ఆర్ వెళ్లనుండడంతో ఇక్కడి భూమికి బదులుగా మహబూబాబాద్ జిల్లాలో మరో భూమిని అటవీ శాఖకు కేటాయించడానికి సిద్ధమైనట్లు తెలిసింది.

### అర్బన్ పార్కు మీదుగా వాస్తవమే..

సంగాపూర్ శివారులోని అర్బన్ పార్కు మీదుగా ట్రిపుల్‌ఆర్ నిర్మాణం చేపట్టడం వాస్తవమే. ట్రిపుల్‌ఆర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు జరుగుతున్నాయి. అందుకు తగిన విధంగా కార్యాచరణ చేపడుతున్నాం. గజ్వేల్ పరిధిలోని అటవీ భూముల్లోంచి కూడా కొంత మేర చేపట్టనున్నారు.

-వినాయక్, ఎఫ్‌ఆర్‌వో, గజ్వేల్

### ఈ జాగ్రత్తలు పాటించండి!

- ఫోన్‌ను అమ్మేముందు డేటాను బ్యాకప్ చేయండి.
- సెల్‌ఫోన్‌లోని డేటాను ఫ్యాక్టరీ రీసెట్ ఆప్షన్ ద్వారా పూర్తిగా తొలిగించాలి. అలా చేయడం వల్ల ఇతరులు మీ వ్యక్తిగత సమాచారాన్ని వినియోగించి బ్లాక్‌మెయిల్ చేసేందుకు అవకాశం ఉండదు.
- అన్ని అకౌంట్ల నుంచి మీ ఫోన్‌ను డీరిజిస్టర్ చేయాలి.
- గూగుల్ అకౌంట్‌ను సైన్ అవుట్ చేయాలి. సెట్టింగ్స్‌లో యూజర్స్ అండ్ అకౌంట్స్ ఆప్షన్‌లోకి వెళ్లి రిమూవ్ అకౌంట్ బటన్‌ను క్లిక్ చేయాలి.
- ఇంత చేసినా కూడా పాత సెల్‌ఫోన్‌ను అపరిచితులకు విక్రయించొద్దు. కొనుగోలుదారు నేరుగా మిమ్మల్ని సంప్రదించాకే విక్రయించాలి.
- అవసరమైతే వారి అడ్రస్ ప్రూఫ్, ఫొటో, సెల్‌ఫోన్‌ను వారికి విక్రయించినట్టుగా సంతకం తీసుకోవాలి.

# పాత ఫోన్లు అమ్మితే.. కొత్త చిక్కులు తప్పవు

**సైబర్ నేరాలకు ఆస్కారం**

సాధారణంగా సెల్ ఫోన్లలో కాపర్, లిథియం తదితర లోహాలతోపాటు మదర్ బోర్డు, ఐసీ, స్క్రీన్ లాంటి ఉపకరణాలు ఉంటాయి. అవి వినియోగించగలిగే స్థితిలో ఉంటే నేరగాళ్ల ముఠాలు వాటిని వేరు చేసి తిరిగి విక్రయిస్తారు. పాత ఫోన్లలో డేటాను ఫార్మాట్ చేయకపోతే పర్సనల్ చిత్రాలు, వీడియోలు ఉంటే అవి సైబర్ నేరస్తుల ముఠాలకు అమ్ముతున్నారు. వీటితోపాటు ఆ ఫోన్లను వీలైతే మరమ్మతు చేసి, సైబర్ నేరాలకు పాల్పడుతుంటారు. ఒకవేళ పోలీసులు దానిపై విచారిస్తే ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగా అమ్మినవాళ్లే నేరస్తులుగా పరిగణించబడతారని హెచ్చరిస్తున్నారు. అందుకే సైబర్ కేటుగాళ్లు తెలివిగా ఇతరుల పేర్లపై ఉన్న సెల్ ఫోన్లను, సిమ్ కార్డులను వినియోగించి నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు.

- వాటి ద్వారానే బాధితులకు డబ్బుల ఎర
- రాజస్థాన్ సైబర్ లింక్‌లో పాత ఫోన్లే కీలకం
- పాత ఫోన్లను అమ్మొద్దంటున్న సీఎస్‌బీ

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): పాత సెల్‌ఫోన్‌ను తెలియని వారికి విక్రయిస్తే చిక్కుల్లో పడే అవకాశాలున్నాయని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు హెచ్చరిస్తున్నారు. పాత మొబైల్ ఫోన్లను కొని వాటితో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఘటనలు వరసగా వెలుగు చూస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. గత ఆగస్టులో బీహార్‌కు చెందిన ఓ ముఠాను రామగుండం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి ఏకంగా 4,000కు పైగా సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముఠాను విచారించడంతో ఎన్నో కీలక విషయాలు వెలుగుచూశాయి. ఇటీవల తెలంగాణ పోలీసులు అరెస్టు చేసిన రాజస్థాన్ ముఠాకు, ఈ పాతఫోన్లు కొని, వారికి విక్రయించే ముఠాలకు సంబంధం ఉన్నట్టు తేలింది. ఈ పాత సెల్ ఫోన్లు కొనుగోలు చేస్తున్న ముఠాలు కిలోల లెక్కన మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసి.. అందులోని సమాచారాన్ని రిట్రీవ్ చేసి, అందులోని కాంటాక్ట్ నంబర్ల చొప్పున సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. గతంలో పట్టుబడిన ఈ ముఠా బీహారులోని కతిహర్ జిల్లా రౌతారా ప్రాంతానికి చెందిన అక్తర్ అలీ సూచనతో పాత సెల్‌ఫోన్లు కొంటారు. తమ నుంచి కిలోల లెక్కన అక్తర్ వాటిని కొనుగోలు చేసి, కీలక సమాచారం సైబర్ నేరగాళ్లకునేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.